క్లుప్తంగా

తెనాలి వాసికి కె.ఎల్ వర్శిటీ డాక్టరేట్



తెనాలి రూరల్: తెనాలికి చెందిన బిట్రా హేమచంద్ర రావు డాక్టరేట్‌ను పొందారు. కె.ఎల్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో ''లో-టెంపరేజర్ డై ఎలక్ట్రిక్ స్టడీ ఆఫ్ కార్బన్ అండ్ మాంగనీస్ డోపెడ్ కాపర్ ఆక్సైడ్'' అనే అంశంపై ఆయన పరిశోధన జరిపారు. గైడ్‌గా భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు పంపారు. హేమచంద్రరావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కొల్లిపర: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీ సుధ తెలిపారు. శుక్రవారం వల్లభాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జాగ్రత్తలు, మందులు అందజేశారు. డాక్టర్ లక్ష్మీ సుధ మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులు వైద్యులు చెప్పిన విధంగా మందులు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే త్వరగా కోలుకుని ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. దీర్ఘకాలిక రోగులు హాస్పిటల్‌లో సంప్రదించవచ్చని, స్వయంగా రోగి వద్దకు వచ్చి పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందిస్తామని భరోసా కల్పించారు.

కళాకారులకు సత్కారం



తెనాలి: ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల్లో స్థానిక పెమ్మసాని థియేటర్లో శుక్రవారం కొండవీటి సింహం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు, కర్నూలు జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెనికలపాటి హనుమంతరావు చౌదరి, పౌరాణిక కళాకారుడు చాగంటి రాఘవ రెడ్డి, వెన్నా సాంబశివారెడ్డిని సత్కరించారు. భట్రాజు సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి.ప్రసన్నాంజనేయరాజు, ఈదర శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావు, చుక్కపల్లి పెద బాబు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి: స్థానిక బోసు రోడ్డులో స్వరాజ్ టాకీస్ సెంటరులోని సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. వాసవి క్లబ్ తెనాలి టౌన్, ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ గోనుగుంట్ల జయంత్ కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. చిన్నారి నమ్రత జన్మదిన సందర్భంగా ఈ సేవను నిర్వహించారు. మాడా వెంకట సుబ్బారావు, భాస్కరుని శివప్రసాద్, గొడవర్తి మల్లికార్జునరావు, తాడికొండ రఘునాథబాబు, మాజేటి శారద, పద్మజకుమారి, పరమేశ్వరి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ

ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులకు గాయాలు

ప్రత్తిపాడు: స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు-1 సచివాలయం మహిళా పోలీస్ రజిని, గనికపూడి సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శుక్రవారం అమరావతి రాజధానిలో జరిగిన సీఎం కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తున్నారు. మార్గమధ్యలో ఏటుకూరు సమీపంలో గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో రజిని, భార్గవీకి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా పోలీసులను పరామర్శించారు. చికిత్స నిమిత్తం వారికి పదివేల రూపాయలను అందించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏటుకూరు బైపాస్‌లోని ఆంధ్రా భోజనం హోటల్‌లో నారాయణ (50) పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం హోటల్ వెనుక పడి ఉన్న రేకుల షెడ్డు వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగలు తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో అగ్రగామిగా అంగలకుదురు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన పేదలందరికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికీ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కేవలం అంగలకుదురు గ్రామంలోనే రూ.21 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను పూర్తిచేసినట్టు గుర్తుచేశారు. అంగలకుదురులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు శుక్రవారం ఆయన కొనసాగించారు. సాయంత్రం గౌడ కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు అక్కడి మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. అధికారులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ఆయా కుటుంబ సభ్యులను పలకరించి, సంక్షేమం అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హులు ఇంకా మిగిలిపోతే సంక్షేమం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మెయిన్ సెంటరు నుంచి రైల్వే ట్రాక్ వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేసిన ఘనత తమకే దక్కుతుందని చెప్పారు. హైస్కూలు ఆవరణలో మహిళా జూనియర్ కాలేజి ఏర్పాటు చేశామని, ఫలితంగా ఈ ప్రాంతంలో విద్యార్థులకు ఇంటర్ విద్య అందుబాటులో ఉందని చెప్పారు. నాడు- నేడు పథకం కింద రూ.1.20 కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆధునీకీకరించినట్టు గుర్తుశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. గ్రామంలో 3,200 కుటుంబాలు ఉండగా, రైతు భరోసా కింద రూ.2,509 మందికి రూ.3.5 కోట్లు రైతుల ఖాతాల్లో జమయినట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాలుగేళ్ల కాలంలో ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను చేపట్టి, పేదలకు సాయం చేస్తున్నామన్నారు. గ్రామంలో 1,100 మందికి పింఛన్లు అందిస్తున్నామని, 1,136 కుటుంబాలకు వైఎస్సార్ చేయూత పథకం కింద నగదును మహిళల ఖాతాల్లో జమచేస్తున్నట్టు చెప్పారు. 254 మందికి వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఇచ్చినట్టు తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా గ్రామంలోని 1,663 కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. తొలుత గౌడ కాలనీలోని శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పార్టీ నేతలు బండి హైమారావు, కడియాల సురేష్, జాస్తి శ్రీనివాసరావు, కావూరి కిశోర్, మొవ్వా ఆనంద్, తోట శ్రీకాంత్, కొండముది కిరణ్‌చంద్, విజయ్, చుండూరు గోపి, ఉరిటి నాగేశ్వరరావు, ఆరవ బాజీ, షేక్ బాదుల్లా, కరాటపు రాజమోహన్, కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• గృహ సారథికి..ఆత్మీయ స్వాగతం



తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాల పంపిణీకి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆత్మీయ స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల రిలే దీక్షలు

తెనాలి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవటంతో ఉద్యోగులు పోరుబాట పట్టారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, తెనాలి యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక చినరావూరు పార్కు వద్ద రిలే నిరాహారదీక్షలను శుక్రవారం ప్రారంభించారు. జిల్లా సహాధ్యక్షుడు ఎల్.మహేష్‌బాబు, గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, తెనాలి తాలూకా యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సౌజన్య, పోతురాజు, కోట సాహెబ్, వహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం గర్వకారణం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రవికుమార్‌ను సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన 'బెస్ట్ డిప్లొమాట్స్' సంస్థ దుబాయ్‌లో ఈ నెల 19-22 తేదీల్లో కృత్రిమ మేధపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని వచ్చిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేకల రవికుమార్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం సత్కరించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రవికుమార్‌ను ఎంపీ మోపిదేవి శాలువతో సత్కరించి అభినందించారు. 65 దేశాల నుంచి 175 మంది ప్రతినిధులు హాజరైన దుబాయ్ సదస్సులో ఇండియా నుంచి కేవలం అయిదుగురికే అవకాశం లభించిందనీ, అందులో రవికుమార్ ఒకరు కావటం గర్వకారణమని చెప్పారు. పార్టీ నేతలు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, అత్తోట చంటి, కంభం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు, వికాసానికి క్రీడలు తోడ్పాటు



క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆలపాటి రాజా

తెనాలి: క్రీడలు వ్యక్తిగత క్రమశిక్షణతోపాటు పరిపూర్ణ వికాసానికి తోడ్పడుతాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కేబీఎస్ అండ్ కేవైఆర్ క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం ఆయన ఇక్కడి వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజ్ మైదానంలో ప్రారంభించారు. జూన్ 5వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథి ఆలపాటి రాజా మాట్లాడుతూ క్రీడలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా నేటిరోజుల్లో క్రికెట్‌కు అపూర్వ ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కోలా అశోక్, పట్టణ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, ఈదర వెంకటపూర్ణ చంద్, మంగమూరి హరిప్రసాద్, అత్తోట శరత్, నలుకుర్తి ప్రభాకర్, శేషగిరిరావు, కొరివి శ్రీనివాసరావు, చెన్నూరి రామారావు, బత్తుల ప్రసాద్, యర్రంశెట్టి వేణు, చెన్నంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ సరికొత్త ప్రయాణం

స్టార్ లైనర్ స్లీపర్ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



స్లీపర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపోలో నూతనంగా తెనాలి-హైదరాబాద్‌కు ప్రవేశపెట్టిన రెండు స్టార్ లైనర్ స్లీపర్ బస్సులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన స్లీపర్ బస్సులు హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండగలవన్నారు. ముందుగా ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలికారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

సత్కార సభలో ఛైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



వలంటీరును సత్కరిస్తున్న ఖలేదా నసీమ్

తెనాలి: పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని నగదు బహుమతులతో సత్కరించటం గొప్ప ప్రోత్సాహకరమన్నారు. పట్టణంలోని 16వ వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లను శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఘనంగా సత్కరించారు. సచివాలయంలో ఏర్పాటైన సభకు కాళిదాసు విజయసత్యం అధ్యక్షత వహించారు. వలంటీరు కె.శ్రీనివాసరావు సేవారత్న అవార్డును అందుకోవటం సంతోషకంగా ఉందన్నారు. పలువురు వలంటీర్లు సేవామిత్ర అవార్డులను స్వీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు దుర్గారావు, నాగేశ్వరరావు, మరియదాసు, వలంటీర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత...

16వ వార్డులో ఇటీవల మరణించిన బుగ్గే నాగలలిత అనే మహిళ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఛైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ అందజేశారు. మిగిలిన రూ.90 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు.

వరికుప్పలు, గడ్డివామి దగ్ధం

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం కసుకర్రులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎకరాల్లోని వరికుప్పలు, ఎకరం గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల నష్టం సంభవించింది. కసుకర్రు గ్రామానికి చెందిన కౌలు రైతులు పండు శ్రీనివాసరావు, సాంబయ్యకు చెందిన మూడు ఎకరాల వరికుప్పలు, జక్కా రవికి చెందిన ఎకరం గడ్డివామికి నిప్పంటుకుని పూర్తిగా కాలి బూడదయ్యాయి.

అన్ని మండలాల్లో బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ప్రత్తిపాడు: గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని మండలాల్లో బూత్ కమిటీల్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.వి.ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. ప్రత్తిపాడులోని వై. వేమారెడ్డి నివాసంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు ఖాజా సాంబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి అధ్వర్యాన దేశ ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాల్ని హర్షిస్తూ తీర్మానం చేశారు. ప్రత్తిపాడు మండలంలో ఇప్పటివరకు 45 బూత్ కమిటీలకు గాను 11 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన కమిటీల్ని కూడా ఏర్పాటు చేసే దిశగా పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 28న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పరాంకుశం శ్రీనివాసరావు, టుబాకో సెల్ స్టేట్ కో- కన్వీనర్ జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి, పార్టీ నాయకులు దార అంబేడ్కర్, అనిల్‌కుమార్, వెంకటశివయ్య పాల్గొన్నారు.

'నీట్'గా చదివి.. వైద్యం చేయాలని..

- తెలంగాణ ఎంసెట్‌లో 4వ ర్యాంకుతో మెరిసిన తెనాలి తేజం..
- తండ్రిని కోల్పోయిన మనోవేదనను దిగమింగుకుని
- చదువుల్లో రాణిస్తున్న కార్తికేయ రెడ్డి
- 'నీట్'లో మెరిసి మెడిసిన్ చేయాలనేది ఆకాంక్ష



దుర్గెంపూడి కార్తికేయరెడ్డి



తాత పేరారెడ్డి, తల్లి ఉమామహేశ్వరి, అమ్మమ్మ రాజేశ్వరితో...

తెనాలి: తండ్రిని కోల్పోయిన మనోవేదనను దిగమింగుకుని ఇంటర్‌లో రాష్ట్రస్థాయి మార్కులతో ఉత్తీర్ణుడైన తెనాలికి చెందిన దుర్గెంపూడి కార్తికేయ రెడ్డి, తెలంగాణ ఎంసెట్ అగ్రికల్చర్/ మెడికల్‌లో నాలుగో ర్యాంకు సాధించాడు. 'నీట్' పరీక్షల్లోనూ ర్యాంకును కైవసం చేసుకుని మెడిసిన్ చేయాలన్న సంకల్పం తీసుకున్నాడు. ఇందుకు తన తల్లి, అమ్మమ్మ, తాతయ్యలు ఇచ్చిన మనోధైర్యమే కారణమని చెబుతున్నాడు.

స్థానిక ఆర్ఆర్ నగర్‌కు చెందిన కార్తికేయ రెడ్డి తల్లిదండ్రులు ఉమా మహేశ్వరి, వెంకటరామిరెడ్డి. ఏపీసీపీడీసీఎల్‌లో ఏఈగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని 2021లో కరోనా సెకండ్ వేవ్ బలితీసుకుంది. ఆ మనోవేదన నుంచి ఆ కుటుంబం ఇంకా తేరుకోనేలేదు. అయినప్పటికీ ఇద్దరు కొడుకులను ఉన్నత చదువులు చదివించాలని కలలుగన్న ఆ తండ్రి ఆశయాన్ని నెరవేర్చాలని ఉమామహేశ్వరి దుఃఖాన్ని దిగమింగుకున్నారు. బిడ్డలకు తండ్రి లేని లోటు తెలియకుండా చూశారు. లక్ష్యసాధనకు తగిన మనోస్థైర్యాన్ని అందించారు. తండ్రి ఉద్యోగరీత్యా గుంటూరులో ఉన్నపుడు సీబీఎస్ఈ టెన్త్‌లో 481 మార్కులతో పాసైన కార్తికేయ రెడ్డి, విజయవాడ గోశాల చైతన్య కాలేజీలో ఇంటర్‌లో చేరాడు. అక్కడా పట్టుదలతో చదివి 983 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. తానేమిటో నిరూపించుకోవాలన్న భావనతోనే తెలంగాణ ఎంసెట్ అగ్రికల్చర్/మెడికల్‌లో పరీక్షకు హాజరయ్యాడు. రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకును సాధించినందుకు ఆ కుటుంబమంతా సంతోషిస్తోంది. తల్లి ఉమా మహేశ్వరి, తాత తాతిరెడ్డి పేరారెడ్డి, అమ్మమ్మ రాజేశ్వరీల సంతోషం అంతా ఇంతా కాదు. కార్తికేయరెడ్డి లక్ష్యం మాత్రం ఎంసెట్ కాదు. వైద్యవిద్య అభ్యసించి, వైద్య రంగంలో స్థిరపడాలనేది తన ఆకాంక్ష. ఇందు కోసం 'నీట్' పరీక్షకు హాజరయ్యాడు. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నానని చెప్పాడు. కచ్చితంగా ర్యాంకు సాధించగలనన్న ధీమాను కార్తికేయరెడ్డి వ్యక్తం చేశాడు. ఎంబీబీఎస్ చేసి, కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ లేక గ్యాస్ట్రో ఎంటరాలజిస్టును కావాలనేది తన ఆశయంగా వివరించాడు. కార్తికేయ రెడ్డి అన్నయ్య చైతన్య కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఎంఎస్ చేసేందుకు గతేడాది అమెరికా వెళ్లాడు.

అభయాంజనేయం.. నామ పారాయణం



గాజులపేట(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి స్వామికి షోడసోప పర్వం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 16 మంది దంపతులు 16 బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భజన భక్త బృందాలు నిర్వహించాయి.

హైకోర్టు న్యాయవాది రవికుమార్‌కు అభినందన



మేకల రవికుమార్‌ను సత్కరించిన ఆర్యవైశ్య నేతలు

తెనాలి: దుబాయ్‌లో ఈ నెల 19-22 తేదీల్లో జరిగిన 'బెస్ట్ డిప్లొమాట్స్' అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని వచ్చిన పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేకల రవికుమార్‌ను శుక్రవారం ఆయన స్వస్థలంలో సత్కరించారు. కృత్రిమ మేధ అంశంపై జరిగిన సదస్సుకు 65 దేశాల్నుంచి 175 మంది ప్రతినిధులు పాల్గొనగా, భారతదేశం నుంచి హాజరైన అయిదుగురిలో మేకల రవికుమార్ ఒకరు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ నేతృత్వంలో స్థానిక కొణిజేటి రోశయ్య మార్గ్‌లోని ప్రైవేటు కార్యాలయంలో రవికుమార్‌ను శుక్రవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించగలరన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తనకు జరిగిన సత్కారానికి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కొణిజేటి గోపీకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వర్లు, ఎన్వీ బ్రహ్మం, కొల్లా గురునాథ గుప్త, ఆలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో ప్రజాచైతన్య సభ

తెనాలి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలనే ప్రజా చైతన్య కార్యక్రమాలను తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏడాదిపాటు నిర్వహిస్తోందని సమాఖ్య తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు శనివారం ప్రకటించారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ప్రజా చైతన్య సభను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాకతీయ సహకార సొసైటీ ఛైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగే సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు, సమాఖ్య ఆంధ్రప్రదేశ్ సమావేశకర్త డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు వక్తలని పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పులతో సహా అన్ని పనులు ప్రజల భాషలో జరగాలని, ప్రజలు, ప్రభుత్వంలో చైతన్యాన్ని పెంచాలనే ఉద్యమంలో భాగంగా జరిగే సమావేశంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని లక్ష్మణబాబు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కానిస్టేబుల్ సహా ఆరుగురు అరెస్టు

ప్రత్తిపాడు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి కానిస్టేబుల్ సహా ఆరుగురిని అరెస్టు చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైఎస్సార్ కాలనీలోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం శుక్రవారం ఎస్ఐకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్స్‌తో పాటు రూ. 25,300ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అయితే, దొరికిన వారిలో జిల్లా కేంద్రంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి వద్ద విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటివి జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రవీంద్రబాబు కోరారు.

రేపు ఎన్టీఆర్ ఆణిముత్యాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఆణిముత్యాలు పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళపై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

బాపట్లటౌన్: మహిళపై దాడిచేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన సలగల ఇందిరా.. దగ్గుమల్లి శేఖర్ అనే వ్యక్తి వద్ద రూ. 15 వేలు అప్పుగా తీసుకున్నారు. అప్పును విడతల వారీగా చెల్లిస్తున్నప్పటికీ గురువారం రాత్రి ఇంటికి వచ్చి శేఖర్ దౌర్జన్యం చేశాడని, తను, తన కుమారుడిపై దాడిచేశారంటూ ఇందిరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ దగ్గుమల్లి శేఖర్‌పై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.